నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 23 ఏప్రిల్ 2024 HYDERABAD





మై ఓట్.. మై వాయిస్'

కాప్రా ఆదిత్యనగర్‌లోని విజయ హైస్కూల్ విద్యార్థులు వినూత్నంగా 'మై ఓట్.. మై వాయిస్' అక్షర రూపంలో కూర్చొని ప్రదర్శన చేశారు. ఓటర్లు చైతన్యవంతులై..తమ ఓటు హక్కు వినియోగించుకునేలా.. చక్కటి సందేశాన్ని అందించారు.

– కాప్రా



హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ సోమవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టికి అందజేశారు. 24న మరో రెండు సెట్‌ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

– అబిడ్స్, ఏప్రిల్ 22

## నామినేషన్ల దాఖలు

### హైదరాబాద్‌లో 6, సికింద్రాబాద్‌లో 9, మల్కాజిగిరి 11

సిటీబ్యూరో/మేడ్చల్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. సోమవారం హైదరాబాద్ స్థానానికి ఆరు, సికింద్రాబాద్ స్థానానికి 9, మల్కాజిగిరి స్థానానికి 11 నామినేషన్లు దాఖలయ్యాయి.

# నీటి బొట్టు.. ఒడిసి పట్టు

### ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతులు తప్పనిసరి

### కమిషనర్ రోనాల్డ్ రాస్

### బల్దియాలో వాన నీటి సంరక్షణపై శిక్షణ



సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల అవసరాలకు ఉపయోగపడేలా ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టాలని బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. వర్షపు నీటిని ఏ మాత్రం వృథా చేయకుండా భూగర్భజలాలను పెంపొందించేలా ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించుకోవడంతో పాటు వాటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి.. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా జీహెచ్ఎంసీ పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్లంబింగ్ వర్కర్లు, మేస్త్రీలకు నగరంలో నీటి సమస్యలు రాకుండా చూడటం, తగిన పరిష్కారం, వర్షపు నీటి సంరక్షించుకోవడం, భూగర్భ జలాలు పెరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి అందుబాటులోకి వచ్చిన వినూత్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఈపీటీఆర్ఐ కన్సల్టెంట్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు సీఈవో కల్పనా రమేశ్ నీటి సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 24, 25వ తేదీల్లో కూడా వర్షపు నీటి సంరక్షణపై ప్లంబింగ్ నిపుణులకు శిక్షణ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు గూగుల్ ఫారం https://forms.gle/rJnheoVKSEU4VDnJA లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణానంతరం ప్లంబర్ వర్కర్లు, మేస్త్రీలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (యూసీడీ) వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

#### జలమండలిలోనూ..

గ్రేటర్‌లో భూగర్భ జలాల్ని పెంచేందుకు జలమండలి, ఈపీటీఆర్ఐ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. మూడు రోజులు (22,23,24వ తేదీలు) ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వాననీటి సంరక్షణలో ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతో ముఖ్యమని ఎండీ సుదర్శన్‌రెడ్డి అన్నారు, ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 86396 19366 ఫోన్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.






సమావేశంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు

# 4వేల పెన్షన్ ఏదీ?

## హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

### కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ మహిళా సమ్మేళనంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

### సేవ చేసేందుకు అవకాశం ఇవ్వండి..

### ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత

కంటోన్మెంట్, ఏప్రిల్ 22: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఎన్నో హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని అమలు చేయకుండా మరిచారని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మహిళా సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని.. ఇవ్వడం లేదని మండిపడ్డారు. కల్యాణ లక్ష్మిలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదన్నారు. నాలుగు వేల పెన్షన్ ఇవ్వడం దేవుడెరుగు, ఇచ్చే రెండు వేల కూడా పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో రెండు నెలల పెన్షన్ పెండింగ్‌లో ఉందని దుయ్యబట్టారు. 24గంటల కరెంట్ ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని, కరెంట్ రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని మల్లారెడ్డి అన్నారు. సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, అనితాప్రభాకర్, లోక్‌నాథం, నళినికిరణ్, శ్యామ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ రూప, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

#### మహిళలంటే కాంగ్రెస్‌కు చులకన..

కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

పెద్ద పెద్ద మాటలు మాట్లాడే సీఎం రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్‌లో గద్దర్ బిడ్డకు టికెట్ ఇవ్వకుండా పూటకో పార్టీ మారే వ్యక్తికి టికెట్ ఇవ్వడం ఏమిటని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. గద్దర్‌పై ఎనలేని అభిమానం చూపినట్లు నటిస్తూనే..ఆయన కూతురు వెన్నెలకు అవకాశం ఇవ్వకుండా.. మహిళలను కాంగ్రెస్ చులకనగా చేస్తున్నదని మండిపడ్డారు. నివేదితను ఎమ్మెల్యేగా, రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

#### సాయన్న బిడ్డకు అండగా ఉందాం..

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన దివంగత ఎమ్మెల్యే సాయన్నకు సొంత ఇల్లు కూడా లేదని, జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం చేశారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అనతి కాలంలోనే తండ్రిని, చెల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నా.. ప్రజాసేవ చేసేందుకు ముందుకొచ్చిన నివేదితకు అండగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తున్నదని, అలాంటి పార్టీకి ఓట్లు వేయొద్దని సూచించారు.



తండ్రి, చెల్లిని గుర్తు చేసుకుని ఒక్కసారిగా కన్నీటిపర్యంతమైన నివేదితను ఓదారుస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్

#### ఆశీర్వదించండి..

కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత అన్నారు. త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తండ్రి, చెల్లి మాదిరిగానే తనను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

#### సేవకుడిగా ఉంటా..

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి

తనను ఆశీర్వదిస్తే, సేవకుడిగా ఉంటానని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'తెలంగాణ కోసం కొట్లాడింది కేసీఆర్.. తెలంగాణ రాష్ట్రం సాధించింది కేసీఆర్.. ప్రాణాలు లెక్కచేయకుండా రాష్ట్రం సాధించిన నాయకుడిని మనం జీవితాంతం గుర్తుంచుకోవాలి' అని అన్నారు. కంటోన్మెంట్‌లో నివేదితను భారీ మెజార్టీతో గెలిపించుకోవడంతో పాటు మల్కాజిగిరి ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. కంటోన్మెంట్ అభివృద్ధిలో సాయన్న చేసిన పనులను ఎవరూ మర్చిపోరని గుర్తు చేశారు. హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.



# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడదాం

### భవిష్యత్ కోసం కంకణబద్ధులై పనిచేద్దాం

### బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో

### ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

శామీర్‌పేట, ఏప్రిల్ 22: మన పార్టీ, మన అభ్యర్థి, మన భవిష్యత్ కోసం పోరు చేయాల్సిన అవసరమున్నదని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికలు బీఆర్ఎస్ కార్యకర్తల భవిష్యత్‌కు ఎంతో ముఖ్యమన్నారు. 20 రోజులు మన పార్టీ, మన అభ్యర్థి, మన భవిష్యత్ కోసం కంకణబద్ధులై పని చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోలేదని, కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న కారణాలతో మాత్రమే మనం అధికారంలోకి రాలేకపోయామన్నారు. శ్రేణులంతా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూనే.. కాంగ్రెస్ పార్టీ చెప్పిన దొంగమాటలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామ గ్రామానా రచ్చబండలు, చౌరస్తాలు, కూడళ్ల వద్ద చర్చలు పెట్టాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరమున్నదన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ఏ పని చేయలేకపోయిందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, స్కూటీలు వంటివి మహిళల కోసం కురిపించిన వరాల జల్లులు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చడంలో ఎవరైనా అడ్డుపడ్డారా అని ప్రశ్నించారు. దొంగమాటలు చెప్పుకుంటూ.. పబ్బం గడిపుకోవడం మానేసీ చిత్తశుద్ధితో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభ ఉంటుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి వెల్లడించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. 'రాజకీయ పునర్ జన్మనిచ్చిన మల్కాజిగిరినే మరిచిపోయిన చరిత్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది. మల్కాజిగిరి ఎంపీగా గెలిచి ప్రజలను ఒక్కరోజైనా పలకరించిన పాపన పోలేదు. రేవంత్ రెడ్డికి కొడంగల్‌లో ఘోర పరాభవం తర్వాత రాజకీయ పునర్ జన్మనిచ్చింది మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలే. కానీ రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ప్రాంతానికి చేసిన ఒక్క పనినైనా ఉందా..? ముఖ్యమంత్రి కాగానే కొడంగల్‌కు రూ.3500 కోట్లు మంజూరు చేసుకున్నారు. మల్కాజిగిరి ప్రాంతం, ప్రజలు కనిపించకపోవడం సిగ్గుచేటు'. అని రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, మేయర్లు, మున్సిపల్ చైర్మన్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అంబర్‌పేట ఫ్లై ఓవర్ ఎందుకు పూర్తి కాలేదు



సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు డప్పు బహూకరిస్తున్న తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశం మొత్తం చూపు సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం వైపే ఉన్నదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చని కిషన్‌రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఐదేండ్లలో పూర్తి చేస్తానన్న అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులు నేటికీ ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీల ప్రతినిధుల సమావేశాన్ని బౌద్ధనగర్ డివిజన్‌లోని రాఘవ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ఈ ఐదేండ్లలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి దానం నాగేందర్ వెళ్తారని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడే రాజీవ్‌సాగర్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

#### తెలంగాణ వాణి వినిపించేది బీఆర్ఎస్సే

ముషీరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి కవాడిగూడ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నేరుగా ఓటర్లను కలిసి.. ఢిల్లీలో తెలంగాణ వాణి వినిపించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు.

## ఎన్నికల శిక్షణ తరగతులకు డుమ్మా..

### 30 మందిపై క్రిమినల్ కేసులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల శిక్షణ విధులకు గైర్హాజరైన 30 మందిపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కొరడా ఝళిపించారు. శిక్షణ తరగతులకు హాజరు కానీ సిబ్బందిపై ఆర్‌పీ యాక్ట్ 1951 సెక్షన్ 134 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీరి సస్పెన్షన్‌కు సంబంధిత హెచ్‌వోడీలకు సిఫార్సు చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.


#### వర్ష సూచన

సిటీబ్యూరో: ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. తిరుమలగిరిలో 5.3, మియాపూర్‌లో 2.0 మి.మీల చొప్పున వాన కురిసినట్లు వెల్లడించారు.


# కాంగ్రెస్.. బీజేపీలు ఏం చేశాయ్

### ఆ పార్టీలకు ప్రజలు ఎందుకు ఓట్లెయ్యాలి : తలసాని

బేగంపేట, ఏప్రిల్ 22: కాంగ్రెస్, బీజేపీలు ఏం చేశాయని ప్రజలు ఆ పార్టీలకు ఓట్లెయ్యాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. నాలుగు నెలల కావస్తున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు మోసగించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చెప్పాలంటే వందకు పైగా ఉన్నాయని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తాము చేసిన అభివృద్ధి ఒక్కటైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలు తమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశించి.. అనేక కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. ఈ నెల 25న ఉదయం ప్యాట్నీ సర్కిల్‌లోని మహబూబ్ కళాశాల ఎస్వీఐటీ ప్రాంగణంలో సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరవుతారని చెప్పారు. అంతకుముందు ఎన్నికల ప్రచార రథాలను తలసాని జెండా ఊపి ప్రారంభించారు. సమావేశంలో కార్పొరేటర్లు మహేశ్వరి, లక్ష్మి, హేమలతతో పాటు మాజీ కార్పొరేటర్లు రూప, శేషుకుమారి, నాయకులు శ్రీహరి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




ఎన్నికల ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

### కాసానిని గెలిపించుకుందాం :ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ/మైలార్‌దేవ్‌పల్లి/ బడంగ్‌పేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అంతారం నరేశ్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. ఓట్లు అభ్యర్థించాలని శ్రేణులకు సూచించారు. మైలార్‌దేవ్‌పల్లిలో ఎన్నికల ప్రచార వాహనాలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. కాగా, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మంగళవారం రాజేందర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బడుగుల గొంతుక కాసానిని ఆశీర్వదించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.